ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 జూలై 2024

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ శివశంకర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 8: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించే బాధితులకు వెంటనే నాణ్యమైన పరిష్కారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని తమ విన్నపాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ప్రజల అర్జీలు స్వీకరించిన మీదట తదుపరి చర్యలకు కలెక్టర్ సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి ఎలా నమోదు చేస్తున్నారని సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప(క్రైం), జూలై 8: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు సైబర్ నేరగాళ్లతో ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీవోవీ.ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ తెలిపారు.

## ఆర్జేడీ రాఘవరెడ్డిపై బదిలీ వేటు

● ఎఫ్‌ఏసీ ఆర్జేడీగా కె.శామ్యూల్

కడప(ఎర్రముక్కపల్లె), జూలై 8: పాఠశాల విద్య జోన్-4 ఆర్జేడీ రాఘవరెడ్డిపై బదిలీ వేటు వేశారు. ఇటీవల ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో విద్యాశాఖ విచారణ చేపట్టింది. క్రమశిక్షణ చర్యల కింద రాఘవరెడ్డిని విద్యాశాఖ అధికారులు బదిలీ చేశారు. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. కాగా.. పాఠశాల విద్య జోన్-4 ఆర్జేడీగా కర్నూలు డీఈవో కె.శామ్యూల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) అప్పగించారు.



కె.శామ్యూల్

# ఇక జడ్పీ ప్రజాపక్షం..!

● నిన్నటి వరకు ఏకపక్షంగా జడ్పీ సమావేశాలు
● సాధారణ ఎన్నికల తరువాత పరిస్థితులు తారుమారు
● వైసీపీ ఓటమితో అంతర్మథనంలో పాలకమండలి
● ఇకపై అడ్డగోలు నిర్ణయాలకు అడ్డుకట్ట
● నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
● మొదటిసారిగా కొత్త సారథులు



జడ్పీ కార్యాలయం

**సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో జడ్పీ పాలకమండలిలో పరిస్థితులు తారుమారయ్యాయి. నిన్నటి వరకు జడ్పీ సర్వసభ్య సమావేశాలు ఏకపక్షంగా సాగగా.. ఇకపై ప్రజాపక్షంగా కొనసాగనున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 10 ఎమ్మెల్యే స్థానాలు ఉండగా 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ 3 స్థానాలకే పరిమితమైంది. గతంలో ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా లేని టీడీపీ కూటమి 7 ఎమ్మెల్యే స్థానాలను దక్కించుకుంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా మంగళవారం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నుంచి రవాణాశాఖ మంత్రితో పాటు మిగిలిన ఆరుగురు ఎమ్మెల్యేలు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ తదితరులు హాజరవుతున్నారు. దీంతో జడ్పీ పాలకమండలి వైసీపీ చేతిలో ఉన్నప్పటికీ సమావేశాలు ఇకపై ఏకపక్షంగా కాకుండా.. ప్రజాపక్షంగా కొనసాగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.**

కడప(రూరల్), జూలై 8: జగన్ ప్రభుత్వ హయాంలో 2021లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని 50 జడ్పీటీసీ స్థానాలలో 38 వాటిని ఏకగ్రీవం చేసుకుని మొత్తం 48 స్థానాలతో జడ్పీ పాలకమండలిని వైసీపీ కైవశం చేసుకుంది. ఈమేరకు ఒంటిమిట్ట మండలం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన అకేపాటి అమరనాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా 2021 సెప్టెంబర్ 25న ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి దాదాపు 3 సంవత్సరాల పాటు 12 స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలు జరిగాయి. మొత్తం 50 మంది జడ్పీటీసీలలో 48 మందితో పాటు 10 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు వైసీపీ వారే కావడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగింది. సభా సంప్రదాయాల ప్రకారం కాకుండా అడ్డగోలు సమావేశాలను సాగించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపై ఈ పద్ధతులకు అడ్డుకట్ట వేయనున్నారు. రాజంపేట ఎమ్మెల్యేగా ఆకేపటి గెలుపొందడంతో ఆయన జూన్ 8న జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న జె.శారదను ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా కలెక్టర్ నియమించారు. ఆమె ఆధ్వర్యంలో నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది.

### కొత్త సారథులు

మంగళవారం నిర్వహిస్తున్న జడ్పీ సమావేశానికి కొత్త సారథులు హాజరవుతున్నారు. రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు కమలాపురం, కడప, మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, పుట్టా సుధాకర్‌యాదవ్ మొదటి సారిగా జడ్పీ సమావేశానికి హాజరవుతున్నారు. వీరితో పాటు ఐదేళ్ల తరువాత జమ్మలమడుగు ఎమ్మెల్యే అదినారాయణరెడ్డి, 15 సంవత్సరాల తరువాత ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సైతం రానున్నారు. నిన్నటి వరకు జడ్పీ చైర్మన్‌గా సమావేశాలను కొనసాగించిన ఆకేపాటి అమరనాథరెడ్డి రాజంపేట ఎమ్మెల్యే హోదాలో, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సమావేశానికి వచ్చే అవకాశం ఉంది. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఏరోజూ జడ్పీ సమావేశానికి రాలేదు. నేడు కూడా వచ్చే అవకాశం లేదు. అలాగే కడప, రాజంపేట ఎంపీలుగా వైఎస్ అవినాశ్‌రెడ్డి, మిధున్‌రెడ్డి గెలుపొందారు. గతంలో కూడా వీరిద్దరూ ఎంపీలుగా ఉన్నారు. ఇప్పటి వరకు జడ్పీ సమావేశాలకు ఎంపీ మిధున్‌రెడ్డి ఏనాడూ హాజరు కాలేదు. అవినాశ్‌రెడ్డి ఆడపాదడపా హాజరై ఇలా వచ్చి అలా వెళ్లేవారు. కాగా మంగళవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో టీడీపీ వారిని ఎదుర్కొనేందుకు సోమవారం వైసీపీ జడ్పీటీసీలతో కడపలో ఎంపీ అవినాశ్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారని తెలిసింది.

### నేటి జడ్పీ సమావేశంపై జనం ఆశలు

మంగళవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంపై జనం గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదివరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కానీ, వైసీపీ జడ్పీ పాలకమండలి కానీ జిల్లా ప్రజల సమస్యలను గాలికి వదిలేసింది. తద్వారా జిల్లా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. రైతులు, రైతు కూలీలు, భవననిర్మాణ కార్మికులు, ఉపాధి కులీలు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో నేడు జరిగే జడ్పీ సమావేశంలో టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రజాపక్షంగా నిలిచి జిల్లాలోని సమస్యలపై అర్థవంతంగా చర్చించి పరిష్కారం చూపుతారని గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు.

### ఇవీ సమస్యలు

- ఐదేళ్లుగా వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయరంగం దారుణంగా దెబ్బతిని సంక్షోభంలో కూరుకుపోయింది. కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరి కొందరు వ్యవసాయాన్ని వదిలి ఉపాధి కోసం పట్టణాల బాటపట్టారు. నకిలీ విత్తనాలు రైతులను బెంబేలు ఎత్తించాయి. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు హల్‌చల్ చేశాయి. పంట ఉత్పత్తులు అమ్ముదాంటే అడవి... కొందామంటే కొరిగా మారాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు అమాంతంగా పెరిగాయి.
- ఐదేళ్లుగా సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణను టెండర్లు లేకుండానే వైసీపీ నేతలు దక్కించుకుని నిధులను నీళ్లలా తాగేవారు. దీంతో గ్రామీణ ప్రాంత నీటిసరఫరాలో కీలకంగా వ్యవహరిస్తున్న జిల్లాలోని 25 సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణ లోప భూయిష్ఠంగా సాగుతోంది. ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతున్నారు.
- వైసీపీ పాలనలో గ్రామీణ రహదారులు అధ్వాన్నంగా మారాయి. ప్రయాణం ఉయ్యాలా జంపాలా.. లాగా మారింది. పంచాయతీరాజ్‌శాఖకు నిధులు లేకపోవడంతో అధికారులు ఏమిచేయలేక కొట్టుమిట్టాడుతున్నారు.
- భవన నిర్మాణ రంగం కుదేలైంది. సిమెంట్, ఇసుక, ఇటుకల ధరలు అమాంతంగా పెరిగాయి. బస్తా సిమెంట్ రూ.350 నుంచి రూ.400ల వరకు పలుకుతోంది. దీంతో గృహనిర్మాణ వ్యవస్థ ప్రజలకు భారంగా మారింది. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ సారథి సీఎం చంద్రబాబునాయుడు సోమవారం నుంచి ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడంతో భవన నిర్మాణ రంగానికి పూర్వవైభవం రానుంది.
- వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ కునారిల్లింది. చాలా వరకు పాఠశాల భవనాలు పాడై ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. విద్యార్థులకు తగినన్ని బల్లలులేవు. నైట్ వాచ్‌మెన్‌లు లేనికారణంగా పాఠశాలల్లోని విలువైన వస్తువులు చోరీలకు గురవుతున్నాయి. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. 80శాతం వసతి గృహాలలో తాగునీరు, ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. నాడు-నేడు పనుల కింద కోట్లాది రూపాయలను ఖర్చు చేసి పైపై మెరుగులు దిద్ది దండుకున్నారన్న ఆరోపణలు మిన్నంటుతున్నాయి.
- జిల్లాలో ఉక్కు పరిశ్రమ, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పిన వైసీపీ మాటతప్పింది. దీంతో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక అలమటిస్తున్నారు.
- స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు లేక నీరసించి పోతున్నాయి. చాలా వరకు అద్దెభవనాలలో నడుస్తున్నాయి. శిశువుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా ఇందుకు తగ్గట్టుగా కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.
- వైసీపీ పాలనలో చిన్న, మధ్యతరహా, భారీ నీటి వనరుల నిర్మాణాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వీటి నిర్వహణకు తగినన్ని నిధులు లేక కునారిల్లిపోతున్నాయి. నీటి వనరుల అభివృద్ధి పేరుతో మంజూరైన నిధులను తూతూమంత్రంగా ఖర్చుచేసి గుటకాయస్వాహా అనిపించారు.
- వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని ఆసుపత్రులలో సిబ్బంది కొరత వేధిస్తోంది. 24 గంటల ఆసుపత్రులలో చాలా వరకు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- విద్యుత్ శాఖకు సంబంధించి చాలా వరకు వ్యవసాయ సర్వీసులకు హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కింద సపరేట్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అధికం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

# చీనీ రైతులను ముంచేస్తున్నారు

● సూట్ లేదంటూ.. సిండికేట్‌తో మోసం
● దళారులు చెప్పిందే ధర ● ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

పులివెందుల, జూలై 8: చీనీ రైతులకు పులివెందులలో సూటు (తరుగు) లేని వ్యాపారం చేస్తామని అప్పటి వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రకటనలు చేసింది. సూటు లేకుండా చేసే వ్యాపారం రైతులకు లాభమని.. పులి వెందుల మార్కెట్ యార్డు నుంచి చీనీ కాయలను ఎగుమతి చేస్తామని హామీ ఇచ్చింది. ఎలాంటి మోసం లేకుండా వ్యాపారం సాగుతుందని ప్రకటనలు గుప్పించింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటనలైతే చేసిందే కానీ.. వ్యాపారుల దోపిడీని మాత్రం అరికట్టలేకపోయింది. సూటు లేకపోయినా కమీషన్ పేరుతో, సిండికేట్ వ్యాపారంతో చీనీ రైతులను వ్యాపారులు నిలువునా ముంచేస్తున్నారు.

పులివెందుల ప్రాంతం చీనీ పంటలకు పెట్టింది పేరు. ఇక్కడ దాదాపు 25వేల ఎకరాల్లో చీనీ సాగులో ఉంది. దిగుబడి ఇచ్చే తోటల నుంచి చీనీ కాయలను మార్కెట్‌కు తరలించాలంటే పెద్ద సమస్యగా మారింది. పది టన్నులకు రెండున్నర టన్నుల తరుగు పేరుతో (సూటు) మినహాయించి ఏడున్నర టన్నులకు మాత్రమే వ్యాపారులు డబ్బు చెల్లిస్తారు. సూట్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత కొన్నేళ్లుగా అనంతపురం మార్కెట్‌లో సూట్‌లేని వ్యాపారం సాగుతూ వచ్చింది. పులివెందుల ప్రాంత రైతులు అక్కడికే తీసుకెళ్లి అమ్ముకునే వారు. అక్కడ సూట్ లేకపోయినా దళారుల బెడద, సిండికేట్ వ్యాపారంతో రైతులు నష్టపోయేవారు.



### ఆర్భాటంగా కొనుగోళ్లు ప్రారంభం

పులివెందుల ప్రాంతంలోనే పెద్దఎత్తున చీనీ తోటలు ఉండడం, వ్యాపారం సాగుతుండడంతో జగన్ ప్రభుత్వం ఇక్కడి నుంచే చీనీ ఎగుమతులు చేస్తామని ప్రకటించింది. అందుకు తగ్గట్లుగానే ఆర్భాటంగా ఏడాదిన్నర క్రితం పులివెందుల మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభించింది. ప్రారంభించిన ఒకటి రెండు నెలల్లోనే కొనుగోళ్లు ఆపేశారు. వ్యాపారులకు తగిన వసతులు లేని కారణంగా ఈ వ్యాపారం ఆగిపోయింది. అనంతరం మరో ఐదారు నెలల్లో మళ్లీ వ్యాపారం ప్రారంభమైంది. ఇది ప్రారంభమైనప్పటి నుంచి రోజు రోజుకు సిండికేట్ పెరుగుతూ వస్తోంది. సిండికేట్ కారణంగా సరైన ధర దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందురోజు టన్ను చీనీకాయలు రూ.30 వేలు పలికితే.. ధర బాగుందని తోటల నుంచి పెద్దఎత్తున మార్కెట్‌కు చీనీకాయలు తీసుకొస్తే మాత్రం ఒక్కసారిగా రూ.20వేలు, రూ.22వేలకు తగ్గించి చీనీకాయలు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.



పులివెందుల మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన చీనీకాయలను పరిశీలిస్తున్న వ్యాపారులు

### సూట్ లేకపోయినా నష్టాలే

రైతులు వారి తోటల నుంచి పులివెందుల మార్కెట్ యార్డుకు నేరుగా చీనీకాయలను తెస్తున్నారు. ఎన్ని టన్నులు చీనీకాయలు తెస్తే అన్ని టన్నులకు డబ్బు చెల్లిస్తామని వ్యాపారులు ప్రకటనలు చేశారు. కానీ లక్షకు ఎనిమిది వేల రూపాయలు కమీషన్ రూపంలో వసూలు చేస్తున్నారు. అలాగే పొలం నుంచి మార్కెట్‌కు తరలించడానికి వాహన ఖర్చు, కూలీల ఖర్చు ఇవన్నీ కలుపుకుని లెక్కలు కడితే తోటల వద్దే వ్యాపారులకు అమ్ముకున్నా లాభసాటిగా ఉందని కొందరు రైతులు అంటున్నారు. తోటల వద్ద రైతు నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తే 10టన్నుల చీనీకాయలకు రెండున్నర టన్నులు సూట్ రూపంలో తీసేసి ఏడున్నర టన్నులకు మాత్రమే డబ్బు చెల్లిస్తారు. వాహన ఖర్చు, కూలీల ఖర్చులో సగం వ్యాపారులే బరాయిస్తారు. అందులోను పులివెందుల మార్కెట్‌లో పలికే ధర కంటే హెచ్చుగా తోటల వద్దే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

### మండీల్లోనూ మోసమే

ఇవన్నీ ఒక ఎత్తు అయితే పులివెందులలో పది మండీలు ఉన్నాయి. ఈ మండీల వద్ద చీనీకాయల వ్యాపారం సాగిస్తారు. ముందురోజు అర్ధరాత్రి వరకు వచ్చే చీనీకాయలను మరుసటి రోజు తొమ్మిది గంటల నుంచి వేలంపాట సాగిస్తారు. ఈ వేలంపాటలో కొందరు వ్యాపారులు సిండికేట్ అయి ఇవ్వాల్సిన ధర కన్న తక్కువ ధరకు వేలం రూపంలో దక్కించుకుంటారు. ఆ చీనీకాయలను అక్కడి నుంచే ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్ కావడంతో రైతులు నిలువునా నష్టపోతున్నారు. ఒక తోటలోని చీనీకాయలను ముందురోజు పది టన్నులు మార్కెట్‌కు తెస్తే దానికి ఒక ధర వేయడం.. మరుసటి రోజు అదే చీనీకాయలు వచ్చినా ధర బాగా తగ్గించడం.. ఇలా అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏదేమైనా పులివెందుల మార్కెట్ యార్డులో సూట్ లేకుండా అమ్మే చీనీకాయల కంటే.. వ్యాపారులకు తోటలవద్దే సూట్‌తో అమ్మే చీనీ కాయలకే కాస్త ధర ఎక్కువగా వస్తోందని రైతులు అంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో అయినా జోక్యం చేసుకుని సూట్ లేకుండా, వ్యాపారులు సిండికేట్ కాకుండా చీనీకాయలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# జనానికి అందుబాటులో ఉండండి

● జిల్లాలో పార్టీ ఇంకా పటిష్టం కావాలి
● ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు చంద్రబాబు సూచన
● ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి
● జిల్లా అధ్యక్షుడితో సహా ఎమ్మెల్యేల ఫిర్యాదు

కడప, జూలై 8 (ఆంధ్రజ్యోతి): "ఎమ్మెల్యేలంతా ప్రజలకు అందుబాటులో ఉండండి, ప్రజాసమస్యలను పరిష్కరించండి. వచ్చే ఎన్నికల్లో పార్టీ మరిన్ని సీట్లు గెలవాలి" అని సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు సూచించారు. సోమవారం సాయంత్రం చంద్రబాబును ఎమ్మెల్యేలు ఎన్.వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, రితీశ్‌కుమార్‌రెడ్డి, ఎస్.గోవర్ధన్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడుతో పాటు పలువురు టీడీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా జిల్లా సమస్యలను వీరు చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు.

ప్రొద్దుటూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు పనిచేయలేదని వైసీపీ కోసం పనిచేశారని.. ఇప్పుడు ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జిని నేనే అంటూ ప్రెస్‌మీట్లు పెట్టి అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ వరదరాజులరెడ్డి ఫిర్యాదు చేశారు. కోగటంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుటుంబీకులు టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారంటూ పుత్తా కృష్ణచైతన్యరెడ్డి.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారని జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కూడా చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. కడపలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారంటూ అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి కుటుంబీకులతో పాటు పలువురిపై జిల్లా అధ్యక్షుడు, కడప ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇక గాలేరినగరి ప్రాజెక్టు గురించి పుత్తా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. కమలాపురం అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. నగర పంచాయతీ కారణంగా ఉపాధి హామీ పనులు లేవన్నారు. కమలాపురాన్ని తిరిగి గ్రామపంచాయతీగా చేయాలన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుపై చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రొద్దుటూరులో గృహ నిర్మాణంలో జరిగిన అవకతవకలు, క్రికెట్ బెట్టింగ్, ఇసుక మాఫియాపై విచారణ జరిపించాలని, ప్రొద్దుటూరుకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని వరదరాజులరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# ఆదర్శనేత వైఎస్సార్ : షర్మిల

వేంపల్లె / పులివెందుల, జూలై 8: ఎంతో మంది పేదలకు మేలు చేసిన నాయకుడు, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆదర్శనేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కొనియాడారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్‌లో ఆమె తండ్రికి నివాళి అర్పించారు. తల్లి విజయలక్ష్మి, భర్త బ్రదర్ అనిల్‌కుమార్, కుమారుడు రాజారెడ్డి, కుమార్తె అంజలి, కోడలు ప్రియ, ఇతర కుటుంబ సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి తదితరులతో కలిసి షర్మిల సోమవారం ఉదయం 8.45గంటల ప్రాంతంలో వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. సమాధి వద్ద కూర్చొని మౌనం పాటించారు. ఫాదర్ నరేశ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఘాట్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను ఆదరించి వారి హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సుధీకర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు విజయజ్యోతి, సలావుద్దీన్, అఫ్జల్‌ఖాన్, నజీర్‌అహ్మద్, ఇర్ఫాన్‌బాష, ధ్రువకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన జగన్ పర్యటన

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన ముగిసింది. శనివారం మధ్యాహ్నం తాడేపల్లె నుంచి సతీమణి భారతితో కలిసి ఆయన కడపకు చేరుకున్నారు. రిమ్స్‌లో ఓ కార్యకర్తను పరామర్శించిన అనంతరం పులివెందులకు శనివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో చేరుకున్నారు. రాత్రికి ఇంట్లోనే బస చేశారు. ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సోమవారం ఉదయం ఆయన బాకరాపురంలోని ఇంటి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఇడుపులపాయకు వెళ్లారు. వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన సమాధి వద్ద పూలమాల ఉంచి అంజలి ఘటించారు. 7.45గంటల ప్రాంతంలో వైఎస్‌కు నివాళులర్పించారు. అనంతరం రోడ్డుమార్గాన కడప విమానాశ్రయం వెళ్లి, అక్కడి నుంచి తాడేపల్లెకు వెళ్లారు.



వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల

# ప్రతి ఇల్లు ఆరోగ్యంతో కళకళలాడాలి

- వైద్యుల సూచనలు పాటించాలి
- కడప రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ

చెన్నూరు, జూలై 8 : మండలంలోని ప్రతి ఇల్లు ఆరోగ్యంతో కళకళలాడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా చెన్నూరులో 8వ తేదీ నుండి 11 వరకు ఇంటింటికీ తిరిగి ఆయా ఇళ్లలోని వ్యక్తుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని వారికి ఎలాంటి జబ్బులున్నా యి, ఎప్పటి నుంచి ఉన్నాయి, ఇంతవరకు ఎలాంటి వైద్యం అందింది. ఇకపై ఎలా వైద్యం చేయాలి అనే విషయాలను తెలుసుకుని ఆ వ్యాధులను పూర్తిగా నయం చేసేందుకు తీసుకోవలసిన చర్యల గురించి వివరిస్తున్నారు. ఇందుకోసం గ్రామంలో మెడికల్ కళాశాలలోని ప్రతి విద్యార్థి ఐదు కుటుంబాలను దత్తత తీసుకోవడం, వారికి అవసరమైన వైద్యసేవలందించడమే లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రతి ఇంటి వద్దకు వెళ్లడం, ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడడం తక్షణ కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించడంతో పాటు గ్రామంలో గ్రామీణ ఆరోగ్య కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. అలాగే నేషనల్ మెడిసిన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అలాగే పలు కుటుంబాల వద్దకు వెళ్లి ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డిలు వైద్యవిద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.



వైద్యకళాశాల విద్యార్థులతో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ

## సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

- కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8 : అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ సూచించారు. సోమవారం కడప కార్పొరేషన్ వీడియోకాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి శాఖాధిపతులకు పంపించామన్నారు. అధికారులు సమస్యల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మొత్తం 52 అర్జీ లు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 23, టౌన్‌ప్లానింగ్ 9, రెవెన్యూ 5, రైతువిభాగం 7, యుపీఏ 3, సచివాలయం 1, హౌసింగ్ 3, జిల్లా ఉపాధి కార్యాలయం 1 వచ్చాయని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

## పండ్లతోటల పెంపకానికి వంద శాతం సబ్సిడీ : ఏపీఓ

చెన్నూరు, జూలై 8 :ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులకు వంద శాతం సబ్సిడీ ఇస్తామని ఏపీఓ శైలజ పేర్కొన్నారు. సోమవారం చెన్నూరులోని ఏపీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 లోపు పండ్లతోటల సాగు పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదెకరాలు, అంత కంటే తక్కువ భూమి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మామిడి, చీనీ, సన్ననిమ్మ, జామ, సపోటా, శీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్‌ఫ్రూట్ వంటి పండ్లతోటలు సాగు చేసుకుంటే మూడేళ్ల పాటు ప్రభుత్వం ద్వారా వంద శాతం సబ్సిడీ, నిర్వహణ చార్జీల కింద చెల్లిస్తామన్నారు. అలాగే రోజా, మల్లెతోటలు సాగు చేసుకునే రైతులకు రెండేళ్లపాటు, మునగతోటలు సాగు చేసుకునే రైతులకు రెండేళ్లపాటు నిర్వహణ చార్జీలు ఇస్తామన్నారు. అదే విధంగా నర్సరీలు ఏర్పాటు చేసుకుని సరఫరా చేస్తే వాటిని పెంచిన వారికి మూడు నెలల పాటు పెంచిన చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కావున ఆసక్తి గల రైతులంతా మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీఓకు లేదా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను సంప్రదించాలని ఆమె తెలిపారు. అలాగే పండ్లు, పూలతోటల సాగు కోసం రైతులు ఉపాధి జాబ్‌కార్డు, భూమి పట్టాదారు పాస్‌పుస్తకం నకలు, 1బి, సన్న చిన్నకారు రైతు పత్రం, జాబ్‌కార్డులో ఉన్న వారి ఆధార్ కార్డులు జిరాక్స్ ప్రతులను ఏపీఓ కార్యాలయానికి అందించాలని ఆమె కోరారు.

## రాజమండ్రి బీజేపీ సభకు తరలిన జిల్లా నాయకులు

కడప (మారుతీనగర్), జూలై 8: రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్యమైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఆ పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీలో కీలకంగా సేవలందిస్తున్న నాయకులందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చి ప్రజాసమస్యలు, రాష్ట్ర పురోభివృద్ధి కోసం దోహదపడాలని నిర్ణయించారు. సోమవారం రాజమండ్రిలోని మంజీరా సరోవర్ సమావేశ మందిరంలో బీజేపీ రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్రస్థాయి అగ్రనాయకులు హాజరై కింది స్థాయి నేతలకు దిశ నిర్దేశం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యం అయినప్పటికీ తప్పొప్పుల పట్ల ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సైతం సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచించినట్లు తెలిసింది. ఈ సభకు కడప జిల్లా నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేశ్‌కుమార్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, రాష్ట్ర నాయకులు కందుల మురళీమోహన్‌రెడ్డి, మునగా సతీష్‌కుమార్, లక్ష్మీనారాయణ రెడ్డి, శాలివాహన్ లక్ష్మణ్‌రావు, అమర్‌నాథరెడ్డి, హరినారాయణరావు తరలివెళ్లారు.


రాజమండ్రి సభలో జిల్లా నాయకులు

## ఉచిత ఇసుక విధానం అభినందనీయం

కడప (మారుతీనగర్), జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం అభినందనీయమని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు చిట్టిబోయిన సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం ద్వారకనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. దీంతో ఇటు భవన నిర్మాణ కార్మికులు, అటు ఇంటి నిర్మాణం చేపట్టాలనుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందిపడ్డారన్నారు. ఇసుక దొరక్కపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొని తినడానికి తిండి లేక రోడ్లపాలయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టడంతో ఒక్కసారిగా అన్నివర్గాల ప్రజల్లో ఆనందం కనిపిస్తోందన్నారు.ఈ ఉచిత ఇసుక విధానంతో ముఖ్యంగా భవననిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అవసరమైన వారు మాత్రమే ఇసుకను తీసుకెళ్లి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు గంగాధర్, రామక్రిష్ణ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

## కేసీ ఉపకాల్వలోకి మురుగునీరు రాకుండా చూడండి

చెన్నూరు, జూలై 8 :చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలోని కేసీ ఉప కాల్వకు పలువురు తమ ఇళ్లల్లోని మురుగునీరు వెళ్లేటట్లు పైపులు ఏర్పాటు చేసుకున్నారని, ఆ నీరు రాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. చాలా కాలంగా కొత్తరోడ్డు లక్ష్మీనగర్ ప్రాంతంలో కేసీ ఉపకాల్వకు ఇరువైపులా పలు కుటుంబాలు తమ ఇళ్లల్లోని మురుగునీరంతా ఆ ఉప కాల్వలోకి వెళ్లేందుకు పైపులు ఏర్పాటు చేశారన్నారు. ఈ పైపుల ద్వారా వెళ్లిన పలురకాల వ్యర్థాలు కూడా కాల్వ నీటిలో తేలుతోందన్నారు. గతంలో ఇదే కేసీ ఉప కాల్వ నీటిని రైతులు సాగు, తాగునీరుగా ఉపయోగించుకునేవారన్నారు. ముఖ్యంగా ఈ కేసీ ఉప కాల్వ కింది ప్రాంతంలోని ఓబులంపల్లె ప్రజలు ఈ నీటిని ఎక్కువగా వాడేవారన్నారు. ఈ నేపథ్యంలో మురుగునీరు కలవడంతో అవి మరింత కలుషితంగా మారుతున్నాయని, తద్వారా రోగాలు వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం కేసీ ఉపకాల్వలోకి ఏర్పాటు చేసిన మురుగునీటి పైపులను తొలగించాలని, లేకుంటే ఆందోళనకు తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## రాజీనామాలు సరే.. నియామకాలు ఎప్పుడు: ఎస్ఎఫ్ఐ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేశారని, అయితే ఆ స్థానంలో నియామకాలు ఎప్పుడు చేస్తారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో కన్వీనరు ఎంఆర్‌నాయక్ ప్రశ్నించారు. సోమవారం వైవీయూలో జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వివిధ కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ వైస్‌చాన్సలర్లు, రిజిస్ట్రార్లు రాజీనామా చేశారన్నారు. అయితే ఉన్నత విద్య ఛైర్మన్‌లు ఎప్పుడు నియమిస్తారో, పీజీ అడ్మిషన్ ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందో, యూనివర్సిటీ విద్యాసంవత్సరం ఎప్పుడు గాడిలో పడుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. యూనివర్సిటీల అభివృద్ధి జరగాలంటే వైస్‌చాన్సలర్లు, వీసీ సభ్యులు, రిజిస్ట్రారు కీలకంగా వ్యవహరిస్తారన్నారు. ఇదంతా జరగాలంటే ఉన్నత విద్య ఛైర్మన్ ఉండాలని, రాష్ట్రంలో ఉన్నత విద్య ఛైర్మన్ రాజీనామా చేసి నెలలుగడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు నియమించలేదన్నారు. తక్షణమే ఉన్నత విద్య ఛైర్మన్, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ వైవీయూ నాయకులు రాకేశ్, విజయ్, శివ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్ నాయక్

## కలెక్టరును కలిసిన ఎస్పీ

కడప (క్రైం), జూలై 8 : కడప నగరం కలెక్టరేట్‌లో కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను ఎస్పీ సిద్దార్థ కౌశల్ సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా కలెక్టరుగా బాధ్యతలు తీసుకున్న ఆయన్ను ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వీరు జిల్లా శాంతిభద్రతలపై చర్చించినట్లు తెలుస్తోంది.


కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ


కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూలై 8: నూతనంగా కడపజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను సోమవారం ఎమ్మెల్సీరామగోపాల్‌రెడ్డి కలిశారు. కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌తో చర్చించారు.

## మంత్రిని కలిసిన బీటెక్ రవి


మంత్రి కొల్లు రవీంద్రతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూలై 8: రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్రను పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను మంత్రికి వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కలెక్టరును కలిసిన టీఎన్ఎస్ఎఫ్ బృందం

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8:గ్రీవెన్‌సెల్‌లో భాగంగా సోమవారం నూతన కలెక్టరు శివశంకర్‌ను టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనిక కోరారు. టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఏటూరి లోకేశ్, గోవిందు, హర్షవర్ధన్‌రెడ్డి, కిరణ్, శరత్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

## మా భూమి మాకు ఇప్పించండి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబం ధర్నా

పులివెందుల రూరల్, జూలై 8: 'సాగు చేసుకుంటున్న మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారు. మా భూమిని మాకు ఇప్పించాలంటూ బాధిత కుటుంబం తహసీల్దార్ కార్యాయం ఎదుట ధర్నా చేశారు. పులివెందుల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఈ ధర్నా జరిగింది. ధర్నాలో కూర్చున్న బుక్కే కాలేనాయక్ కుమారుడు వశ్రమ్‌నాయక్, కోడలు రేష్మాబాయ్ ఇతర కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సోమవారం పులివెందుల మండలం కనంపల్లె గ్రామానికి చెందిన బుక్కే కాలేనాయక్‌కు సర్వే నెంబర్ 121లో 2.55 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిలో 1.10 ఎకరాలు అదే గ్రామానికి చెందిన మూడె దశరథనాయక్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో ఆక్రమించుకున్నారన్నారు. మా భూమి మాకు ఇవ్వాలని ఎన్నోమార్లు పెద్దమనుషుల ద్వారా కోరామన్నారు. అక్కడ పరిష్కారం కాకపోవడంతో రెవెన్యూ అధికారులకు సమస్యను విన్నవించామన్నారు. అటు ఆర్డీఓకు, ఇటు తహసీల్దార్‌కు ఎన్నోమార్లు అర్జీలు అందించామన్నారు. ఈ క్రమంలో దశరథనాయక్ అనేవ్యక్తి తన రాజకీయ పలుకుబడితో మా భూమిని ఆన్‌లైన్‌లో తొలగించాడన్నారు. దీన్ని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారన్నారు. ఇంటి వద్దకు వచ్చి బెదిరిస్తున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లామన్నారు.అక్కడ కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కమీషన్‌కు వెళ్లినా ఫలితం లేదన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినా సరైన సమాధానం పంపకుండా అది లేదు, ఇది లేదు అని తిప్పి పంపుతున్నారని చెప్పారు. ఎక్కడా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక విధిలేని పరిస్థితుల్లో కోర్టుకు వెళ్లామన్నారు. నేటికి తమపై దాడులకు దిగుతున్నారని, సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. పోలీసులు కనీసం మానవత్వం కూడా చూపడంలేదన్నారు. తమ గోడును పట్టించుకోవాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగామన్నారు. మాపై దయ చూపాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బుక్కే కాలేనాయక్ కుమారుడు, కోడలు, ఇతర కుటుంబ సభ్యులు

**తహసీల్దార్ ఏమన్నారంటే....**

ఈ విషయంపై పులివెందుల తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా ఆ భూ సమస్య ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. కోర్టులో ఉన్న దానిని తాము పరిష్కరించలేమన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

## పూర్వ విద్యార్థుల కలయిక

పులివెందుల టౌన్, జూలై8: పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978-1983లో చదివిన విద్యార్థులు సోమవారం ఒక్కచోట కలిశారు. మండలంలోని మోట్నూతలపల్లె గ్రామంలో వెలసిన కోనగవేశ్వరస్వామి ఆలయంలో వీరు కలిశారు. అక్కడ వారుచిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుంటూ ఆట పాటలతో ఆనందించడం జరిగింది. అదేవిధంగా ఆలయంలో అభివృద్ధి పనుల నిర్మాణాలకు రూ.60వేలు విరాళం ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో అభివృద్ధికి తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఓబులరెడ్డిని, ఆలయ పూజారి లక్ష్మణ్‌లను శాలువతో సన్మానించారు.


1978-1983 బ్యాచ్ జూనియర్ విద్యార్థులు

## కడప ఇన్‌చార్జ్ ఆర్డీఓగా వెంకటపతి బాధ్యతల స్వీకరణ

కడప(కలెక్టరేట్), జూలై 8: కడప రెవెన్యూ డివిజనల్ ఇన్‌చార్జ్‌గా వి.వెంటపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా కడప ఆర్డీఓ మధుసూదన్ సెలవుపై వెళ్లడంతో వెంకటపతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.



## టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కేతన్‌కుమార్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8 :టీడీపీ విద్యార్థి విభాగం అనుబంధ సంస్థ టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన బిజివేముల కేతన్ కుమార్‌రెడ్డిని నియమించారు. సోమవారం టీఎన్ఎస్ఎప్ జిల్లా కార్యాయలంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ నియామక పత్రాలను ఆయనకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆశీర్వా దంతో టీడీపీ నాయకత్వం తరపున విద్యార్థుల పక్షాన నిలబడి వారి సంక్షేమ పరిరక్షణ కోసం పోరాడి అండగా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏటూరి లోకేశ్, అనిల్, రాజేశ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రం అందుకుంటున్న కేతన్‌కుమార్‌రెడ్డి

## 24న మీట్ మార్కెట్‌లోని స్టాల్స్‌కు బహిరంగ వేలం

పులివెందుల టౌన్,జూలై 8:పులివెందులలోని వైఎస్సార్ మీట్ మార్కెట్‌లో ఈనెల 24వ తేదీన మటన్, చేపల స్టాల్స్‌లకు బహిరంగం నిర్వహించనున్నట్లు కమిషనర్ రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24వ తేదీ ఉదయం 10గంటలలోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, 11గంటలకు వేలం ఉంటుందన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం, జూలై 8: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సల్మాన్ రాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 11.00 గంటలకు జరిగే సమావేశానికి మండల అధికారులు, వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిదులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీఈడీఓ కోరారు.

## వ్యవసాయ సంచాలకులు అందుబాటులో ఉండాలి

కమలాపురం రూరల్, జూలై 8: గ్రామ మండల స్థాయిలో పనిచేసస్తున్న వ్యవసాయ సహాయకులు అన్నివేళల్లో రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం సహా య వ్యవసాయ సంచాలకుల కార్యాలయం నందు ఏడీఏ నరసంహారెడ్డి అధ్యక్షతన కమలాపురం వ్యవసాయ డివిజన్‌పరిధిలోని వ ల్లూరు, కమలాపురం, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్లమండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రస్తుతంసాగులో ఉన్న పంటలపై జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా వనరుల కేంద్రం కడప వారు శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులకు ఆధునిక పద్ధతులు తెలి య జేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శివశైలజ, కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.శ్రీకాంత్‌రెడ్డి, సాయిజ్యోతి, సరస్వతి, శ్యాంబాబు పాల్గొన్నారు.



## మాకు న్యాయం చేయండి సారూ...

- కలెక్టరుకు మాసాపేట వాసుల వినతి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8:మాకు కేటాయించిన భూములను మాకు ఇప్పించాలని మాసాపేట వాసులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్లూరు మండలం నల్లాయపల్లె గ్రామంలో ఏపీ భూదాన యజ్ఞ బోర్డు సంస్థ భూదాన భూములను తమకు కేటాయించిందన్నారు. 1982, 1986, 1987 ప్రొసీడింగ్స్ భూమి అలాట్‌మెంటు చేశారని, ఒక్కొక్కరికి 2.50 ఎకరాల భూమి ఇచ్చారన్నారు. ఎమ్మార్వో ఆన్‌లైన్ పట్టా చేస్తామంటున్నారు కానీ ల్యాండ్ రికార్డులన్నీ పరిశీలించి చేస్తామని చెబుతున్నారన్నారు. అయితే కలెక్టరు ల్యాండ్ పర్మిషన్ ఆర్డరు అనుమతిస్తే మా భూమి మాకు వస్తుంద న్నారు. విజయవాడలో ఉన్న సీసీఎల్ఏ కార్యాలయంలో సమాచార చట్టంలో భూమి రికార్డులు తీసుకున్నట్లు తెలిపారు. రాజంపేట సబ్‌కలెక్టరు పర్మిషన్ కూడా ఇచ్చారని, బద్వేలు ఆర్డీఓ భూమి రికార్డు కాపీ పంపించారన్నారు. గత కొంతకాలంగా తహసీల్దారు, కలెక్టరు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగలేదని, తక్షణం కలెక్టరు స్పందించి భూమిని తమకు ఇప్పించాలని కోరారు. మాసాపేట వాసులు ప్రభుకుమార్, నరేశ్, వెంకటరమణయ్య, ఆదాం, చిన్న ఆంజనేయులు, నరసింహులు, కొండమ్మ, వెంగమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.


కలెక్టరుకు సమస్యలు వివరిస్తున్న మాసాపేటవాసులు

## గిరిజన ప్రభుత్వ బాలుర వసతిగృహాలను ఏర్పాటు చేయాలి

కడప (మారుతీనగర్), జూలై 8: జిల్లాలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం నిమిత్తం నూతనంగా గిరిజన ప్రభుత్వ బాలుర హాస్టల్ వసతిగృహాలను మరికొన్ని ఏర్పాటు చేసి తద్వారా గిరిగిన విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచేందుకు బాటలు వేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం (ఎబిబిఎస్ఎస్) రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్, జిల్లా అధ్యక్షుడు రమావత్, జగన్నాయక్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరు శివశంకర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబరులో కలిసి విజ్ఞప్తి చేశారు. మైదాన ప్రాంతంలో నివశిస్తున్న గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న జూనియర్, డిగ్రీ, పీజీ, కాలేజీల ఉపాధ్యాయ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అర్జున్‌నాయక్, వెంకటస్వామి నాయక్, బీడీ నాయక్, శ్రీనునాయక్, గోపినాయక్, రమేశ్‌నాయక్, మల్లే నాయక్, బాబునాయక్‌పాల్గొన్నారు.



## అందరికీ అందుబాటులో ఇసుక

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూలై 8: సామాన్య ప్రజలకందరికీ ఇసుక అందుబాటులో ఉండాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని, అందుకే ఉచిత ఇసక విధానాన్ని తీసుకువచ్చారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం - ఎర్రగుంట్ల ప్రధాన రహదారి సమీపంలో పట్టు పరిశ్రమ వద్ద నిల్వ ఉంచిన ఇసుక డంప్ నుంచి ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నెలలోపే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రస్తుతం స్టాకు పాయింట్ నుంచి ఇసుకను సరఫరా చేస్తామన్నారు. తరువాత నదుల నుంచి ఇసుక సరఫరా కార్యక్రమం చేపడతామన్నారు. గతంలో రూ.750 ఉన్న ఇసుకను రూ.340కి అందిస్తున్నామన్నారు. త్వరలో ఇసుక తక్కువ రేటుతో అందుబాటులో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రమణ్యం, ఎంపీడీవో జ్యోతి, ఏపీఎం అపర్ణ, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, దివాకరరెడ్డి, జంపల నరసింహారెడ్డి, ఎన్టీఆర్ రమణారెడ్డి, కరీంపల్లె, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

# మానవ తప్పిదాలతో ప్రాణాలు కోల్పోరాదు

## పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశంలో కడప జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) జూలై 8: చిన్న పాటి మానవ తప్పిదాలతో పరిశ్రమల్లో ఏ ఒక్క కార్మికుడి ప్రాణాలూ కోల్పోకూడదని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను పటిష్టం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మికశాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్ని మాపక శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలను పర్యవేక్షించాలన్నారు. రెడ్ క్యాటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందుకు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్, ప్రొటో కాల్ చర్యలను ఖచ్చితంగా పాటించాలన్నారు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేటలో అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో తాజాగా జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఫ్యాక్టరీల్లో చిన్న పాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణం కావచ్చని క్రైసిస్ గ్రూప్ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు రెవెన్యూ, ఫైర్ శాఖలు సమన్వయంతో మాక్ డ్రిల్ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో, ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణ సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ కృష్ణమూర్తి, సంబంధిత అధికారులు, సాక్ జడ్‌ఎం శ్రీనివాస మూర్తి, జీఎం జయలక్ష్మీ, ఫైర్ అధికారి ధర్మారావు, ఇండియా, భారతి, దాల్మియా, జువారీ సిమెంట్స్ తదితర పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'రాజోలిని' జిల్లా పరిధిలోకి మార్చాలి

● మంత్రికి ఎమ్మెల్యేల వినతి


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యేలు

మైదుకూరు, జూలై 8: రాజోలి రిజర్వాయర్‌ను నంద్యాల జిల్లా నుంచి కడప జిల్లాకు మార్చాలని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయంలో ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా చైతన్యరెడ్డి, కడప పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాల భూపేష్‌రెడ్డి మంత్రి రామానాయుడును కలసి రాజోలి రిజర్వాయర్‌ను త్వరగా నిర్మిస్తే కేసీ కాల్వ, తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా లక్షలాది మంది రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. దీంతో ఏడాదికి పుష్కలంగా రెండు లేదా మూడు పంటలు వేసుకోవచ్చని, రైతుల కోసం రాజోలి రిజర్వాయర్ త్వరితగతిన నిర్మించేందుకు నంద్యాల జిల్లా నుంచి కడప జిల్లాకు మార్చాలని కోరుతూ వినతి పత్రంను మంత్రికి అందించారు. కాగా రాజోలి నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి కూడా శంకుస్థాపనలు చేసి మిన్నకుండిపోయిన విషయం తెలిసిందే. కాగా టీడీపీ ప్రభుత్వంలో రాజోలి నిర్మాణం జరిగితే రైతులకు టీడీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేసినట్లవుతుంది.

# ప్రమాదకరంగా గండికోట స్లూయిస్ గేట్లు

## మెయింటెనెన్స్ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

## నివేదిక కోరిన టీడీపీ ప్రభుత్వం


గండికోట ప్రాజెక్టు

కొండాపురం, జూలై 8: గండికోట ప్రాజెక్టు స్లూయిస్ గేట్లు ప్రమాదకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు మెయింటెనెన్స్ పనులు చేపట్టకపోవడంతో స్లూయిస్ గేట్లు మరమత్తులకు నోచుకోలేదు. దీంతో వారం రోజుల కిందట మైలవరం జలాశయానికి నీరు వదిలే సమయంలో గేట్లు తెరుచుకోక పోవడంతో అధికారులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. స్లూయిస్ గేట్ల రోప్ దెబ్బతినడంతో గేట్లు మొరాయించినట్లు తెలుస్తోంది. అయితే తాత్కలికంగా వీటిని సరిచేసి మైలవరం జలాశయానికి నీరు వదులుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మెయింటెనెన్స్ పనులకు టెండర్లు పిలిచినా ఎవరూ పనులు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో మరమత్తులకు నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక అత్యవసరంగా మెయింటెనెన్స్ గురించి అడిగిందని, దీనికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపుతునున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఎక్కువ రోజులు గేట్ల రోప్ నీటిలో నానడం వల్ల దెబ్బతినిందని డీఈ తెలిపారు. అయితే ఇప్పటికిప్పుడు ప్రమాదమేమీ లేదని, ప్రస్తుతం గండికోట నుంచి మైలవరం జలాశయానికి 400 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు డీఈ తెలిపారు.

# అనుమతి లేని మందులను విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 8: ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి లేని పురుగుల మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కేఎంపీ ప్రసాద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంలో మూడు ఎరువుల నమూనాలు, భారత్ సీడ్స్ దుకాణంలో రెండు విత్తన నమూనాలను సేకరించి పరీక్షకోసం ల్యాబ్‌కు పంపారు. రికార్డులు సరిగాలేని రూ.1,17,855 విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. తిరుమల సీడ్స్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించని రూ.17,440 మందుల విక్రయం చేయరాదని ఆదేశించారు. అధిక ధరలకు పురుగుల మందులు విక్రయించినా, అనుమతులు లేని ఎరువులు విక్రయించినా దుకాణ దారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, మందులు కొనే ప్రతి రైతుకూ బిల్లు చెల్లించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఈదురుబాష, వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం ఏఓ గోవర్ధన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సురేష్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరువర్గాల ఘర్షణ - ముగ్గురికి గాయాలు

పెండ్లిమర్రి, జూలై 8: సవాస్కాన్‌పల్లెలో ఇరువర్గాలమధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గ్రామంలో కోలాటం జరుగుతుండగా మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. గతంలో కూడా ఇరువర్గాల మధ్య విబేధాలు ఉండేవి. వీరిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఒకవర్గానికి చెందిన నరసింహారెడ్డి ఫిర్యాదుపై ఏడుగురిపై, మరోవర్గానికి చెందిన నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. పోలీసులు ఉండగానే ఇరువర్గాలు ఘర్షణ పడడం మండలంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# బద్వేలులో ఆగని భూ వివాదాలు

**అసలు ఇంటి పట్టాలు కొందరి వద్ద..**
**మరికొందరి వద్ద నకిలీ పట్టాలు**
**ఆందోళనలో అసలు లబ్ధిదారులు**

బద్వేలు రూరల్, జూలై 8: బద్వేలు పట్టణం నానాటికీ విస్తరిస్తోంది. చుట్టూ గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పిల్లల చదువుల కోసం, వృత్తి వ్యాపారాల రీత్యా పట్టణానికి వచ్చి చేరుతున్నారు. దీంతో స్థలాల ధరలకు రెక్కలొచ్చి ప్రభుత్వ డీకేటీ స్థలాలు కూడా లక్షలాది రూపాయలు పలుకుతున్నాయి. ఈ క్రమంలోనే నకిలీ పట్టాల ముఠా తయారై డీకేటీ పట్టాలకు నకిలీ పట్టాలు తయారు చేసి, విక్రయించి భూవివాదాలకు తెరలేపారు. అయితే బద్వేలు రెవెన్యూ డివిజను అయిన తరువాత మొదటి ఆర్డీఓ ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలపై ఉక్కుపాదం మోపి నకిలీ పట్టాలు తయారు చేసే ముఠాను మరికొందరిని దోషులుగా గుర్తించి జైలుకు పంపారు. కొంతకాలం భూవివాదాలు సద్దుమనిగినా ఇటీవల మళ్లీ తెరపైకి వచ్చాయి. దీంతో అసలైన లబ్ధిదారులకు, నకిలీ పట్టాలున్న లబ్ధిదారుల నడుమ వివాదాలు సాగుతూ అసలైన పట్టాదారులు ఆందోళనకు గురవుతున్నారు.

### నకిలీ పట్టాలు ఇంకా ఉన్నాయా ?

బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తరువాత మొట్ట మొదటి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలపై దృష్టి సారించి నకిలీ పట్టాల గుట్టు రట్టు చేశారు. కొంత మందిని నకిలీ పట్టాల దోషులుగా గుర్తించి జైలుకు పంపడంతో కొంత కాలం భూవివాదాలు సద్దుమనిగాయి.

### ఇటీవల మొదలైన భూవివాదాలు

మొదట తలెత్తిన భూవివాదాలు కొందరు అధికారుల చర్యలతో సద్దుమనిగినా ఇటీవల మళ్లీ పడగ విప్పేందుకు సిదమవుతున్నాయి. డీకేటీ పట్టాలు


వివాదాలు తలెత్తిన మహ్మద్ కాలనీలో ఓ ప్రాంతం

ఎక్కువగా ఉన్న సుందరయ్యకాలనీ, మహ్మద్ కాలనీ, మార్తోమానగర్, ఐలమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థలం తమదేనంటూ రెండు వర్గాలు వాదనలకు దిగుతుండడంతో అసలు పట్టాదారుడు ఎవరు? నకిలీ పట్టాదారుడు ఎవరో గుర్తించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. భూవివాదాలు మళ్లీ మొదటికి వచ్చేసరికి అసలైన లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

### రెవెన్యూ శాఖలో రికార్డులు మాయం

డీకేటీ పట్టాలు ఎక్కువగా ఉన్న గోపవరం మండల రెవెన్యూ కార్యాలయంలో కొన్ని రికార్డులు మాయమైనట్లు సమాచారం. రికార్డులు మాయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన వారు ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహించడంలేదు. రికార్డులు మాయమైన స్థానే నకిలీ పట్టాలు తయారయ్యాయి. దీంతో అసలైన లబ్ధిదారుడు ఎవరో గుర్తించలేని స్థితిలో రెవెన్యూ అధికారులున్నారు. అసలైన లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా రికార్డులు లేవని బాధితులకు రెవెన్యూ అధికారులు చెబుతుండడం గమనార్హం.

### పంచాయితీ పెద్దమనుషులు

పట్టణంలో నెలకొన్న భూవివాదాలు పరిష్కరించేందుకు పట్టణంలో దాదాపు ఓ ఐదారు బ్యాచ్‌లున్నాయి. భూ వివాదం ఏర్పడిన వెంటనే సమాచారం తెలుసుకుని అసలైన లబ్ధిదారులు పెద్దమనుషుల పంచాయతీ వద్దకు వెళుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు జునైన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోడం వల్ల బాధితులు పెద్ద మనుషుల మధ్య పంచాయతీ చేసుకునేందుకు సిద్దమవుతున్నారు. పెద్దమనుషుల వద్ద పంచాయతీలో అసలైన లబ్ధిదారులకు, నకిలీ పట్టా కలిగిన వారికి ఇద్దరిలో ఒకరికి లాభాన్ని చేకూర్చి తాము కొంత సొమ్మును వెనకేసుకుంటూ పంచాయతీలు నడుపుతున్నారు.

### ఇప్పటికైనా పరిష్కారమవుతాయా

పట్టణంలో పదేళ్లగా భూవివాదాలు మొదలయ్యాయి. ఎంత మంది అధికారులు మారుతున్నా భూవివాదాలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. రికార్డుల ప్రకారం అసలైన లబ్ధిదారుని గుర్తించే వీలు లేకపోవడమే సమస్యగా తయారైనట్లు బాధితులు వాపోతున్నారు. అసలైన లబ్ధిదారుడిని గుర్తిస్తే సమస్యే లేదు కదా అన్న వాదనలు ప్రజల నుంచి మేధావి వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా బద్వేలులో భూ వివాదాలు జరుగుతున్నా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమని పలువురు వివరిస్తున్నారు.

### వివాదాలు ఉన్నాయి

పట్టణంలోని గోపవరం ప్రాంతానికి చెందిన డీకేటీ ఇంటిస్థలాలపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సమస్యలు పరిష్కరించేందుకు రికార్డులు అందుబాటులో లేవు. గతంలో నమోదైన నకిలీ పట్టాల కేసుకు సంబంధించి కొన్ని రికార్డులు ఉన్నతాధికారుల వద్ద ఉండగా మరికొన్ని రికార్డులు లేవు. దీంతో సమస్యను పరిష్కరించ లేకున్నాం. డీకేటీలను కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమైనా ఈ ప్రాంతంలో అమ్మకాలు కొనసాగడం విడ్డూరం. త్వరలోనే ఈ సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతాం.

*- ఎం.రోశయ్య, గోపవరం తహసీల్దారు*

# పదవి ఊడినా.. స్టిక్కర్...

## ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న వైసీపీ నేతల కార్లు



తాజా మాజీ ఎమ్మెల్యే కారుకు అలానే ఉన్న ప్రభుత్వ విప్ స్టిక్కర్

రైల్వేకోడూరు, జూలై 8: తాజా మాజీ ఎమ్మెల్యేకి పదవి పోయినా గతంలో ఆయనకు ప్రభుత్వం కేటాయించిన స్టిక్కర్ మాత్రం ఊడలేదు. నెంబరు ప్లేట్‌కు ప్రభుత్వ విప్ అంటూ స్టిక్కర్‌ను తొలగించలేకున్నారు. ఆయనతో పాటు చాలా వైసీపీ నేతల కార్లకు ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్నారు. సోమవారం రైల్వేకోడూరు టోల్గేట్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పూలమాలలు వేయడానికి తాజా మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వచ్చారు. తన ఓల్వో కారుకు ముందు వెనుక ప్రభుత్వ విప్ స్టిక్కర్ ఉంది. ఎన్నికలు అయిపోయాయి, వైసీపీ కోడూరులో ఓడిపోయింది. జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యే గెలిచారు. అయినా తాను మాజీ ఎమ్మెల్యే అనుకోకుండా ఊహల్లో ఉండి కారుకు ఉన్న స్టిక్కర్‌ను తొలగించకుండా తాజా మాజీ ఎమ్మెల్యే తిరుగుతుండడం పట్ల కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన అనుచరులకు ఉన్న కార్లకు కూడా ఎమ్మెల్యే స్టిక్కర్లు ఉన్నాయి. కొందరు హుందాగా తీసివేసినా తాజా మాజీ మాత్రం తొలగించకుండా అట్లే పెట్టుకున్నారు. దీంతో సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


వైసీపీ నేతల కార్లకు తొలగించని ఎమ్మెల్యే స్టిక్కర్లు

# ఇసుక తరలింపుపై కేసు నమోదు

పోరుమామిళ్ల, జూలై 8: క్వారీలో ఉండాల్సిన ఇసుకను దొంగతనంగా తరలించినందుకు నాగేంద్ర అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుక క్వారీలో ఆదివారం రాత్రి నాగేంద్ర అతని అనుచరులు ట్రాక్టరుతో ఇసుక తీసకెళ్లడంతో దీనిపై విచారణ జరిపి వీఆర్వో రామలక్షుమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# 8 మంది జూదరుల అరెస్టు

వీరబల్లి, జూలై8: ఓదివీడు పంచాయతీ కావలిపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.49,500లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు తెలిపారు.

# ఆన్‌లైన్ సేల్స్ చేయకూడదు


రికార్డులను పరిశీలిస్తున్న ప్రసాద్‌రెడ్డి

ఖాజీపేట, జూలై 8: అనుమతి లేకుండా ఆన్‌లైన్ సేల్స్ చేయకూడదని తిరుపతి ఎస్‌డీఎల్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖాజీపేటలోని ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ దుకాణాలను తనిఖీ చేశారు. అయితే ఒక్క దుకాణంపై మాత్రమే తనిఖీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. అదీకూడా నామమాత్రంగా తనిఖీ చేయడం గమనార్హం. మాట్లాడుతూ అమ్మకం ధృవీకరణ పత్రం లేకుండా ఎటువంటి అమ్మకాలు చేయరాదని, ఇష్టానుసారంగా చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగార్జున, టెక్నికల్ ఏఓ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి మండిపల్లిని కలిసిన ఆసియా ఒలింపిక్ చాంపియన్ శ్రీలక్ష్మి


శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై8: ఆసియా ఒలింపిక్ చాంపియన్ శ్రీలక్ష్మి సోమవారం ఎస్ఎన్‌కాలనీలోని కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాదొరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనేలా క్రీడలను అభివృద్ధి చేయాలని ఆమె మంత్రిని కోరారు. తను సాధించిన మెడల్స్ గురించి ఆయనకు వివరించారు.

# వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు


సీసీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు, బాధితులు

ముద్దనూరు జూలై8: మండలంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. 10 రోజుల నుంచి తాళం వేసిన ఇళ్లు, దుకాణాలు లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలను సైతం లెక్క చేయకుండా చాకచక్యంగా చోరీ చేస్తూ దొరికినంత దోచుకెళుతున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానికుల సమాచారంతో వివరాల్లోకెళితే....

ఆదివారం రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీలు జరిగాయి. నాలుగు రోడ్ల కూడలిలోని ఐరన్ దుకాణం, పెయింట్ దుకాణంలో చోరీలు జరిగాయి. క్యాష్ బాక్స్ పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఒక దుకాణంలో దాదాపు రూ.15వేలు నగదు మొబైల్, మరో దుకాణంలో రూ.4వేలు నగదు, దేవుడి హుండీ చోరీ చేయగా పాత బస్టాండులోని గుడ్లు, టీ దుకాణం బీగాలు పగుల గొట్టినట్లు తెలిసింది. అయితే వారం రోజుల కిందట నాలుగు రోడ్ల కూడలిలోని పాల కేంద్రంలో చోరీకి పాల్పడ్డారు. నల్లబల్లె గ్రామ సమీపంలోని మూత పడిన పాత మిషన్ వద్ద మోటార్లు చోరీ జరిగాయి. అంతేకాకుండా చిన్నదుద్యాల గ్రామ సమీపంలోని మూతపడిన తార మిక్సింగ్ ప్లాంట్ వద్ద మోటార్లు చోరీకి గురవడంతో యజమాని ఏమంటాడోనని కాపాలాదారుడు ఓబులేసు ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. చోరీకి సంబంధించి బాధితులు సీసీ పుటేజీ సహా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కొన్నింటిపై మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారని బాధితుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

# ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

## ఎట్టకేలకు లొంగిపోయిన నిందితులు.. రిమాండు

కడప (క్రైం) జూలై 8: కడప టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ భాస్కర్ (ఏఎస్ఐ-246) అతని సోదరుడు, ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్ (ఎఆర్ హెచ్‌సీ - 1801)లను సస్పెండ్ చేస్తూ కర్నూలు డీఐజీ సీహెచ్ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన దాడి ఘటనలో నిందితులుగా ఉన్నారు. వీరితో పాటు ఉన్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సదరు కేసులో నిందితులుగా ఉన్న వీరు పరారీ అయ్యారు. రెండురోజుల కిందట కోర్టులో లొంగిపోయారు. మెజిస్ట్రేట్ వారిని రిమాండుకు ఆదేశించారు. వీరి వ్యవహారంపై నిఘా విభాగం ఎస్పీ సిద్దార్థ కౌశల్‌కు నివేదిక ఇచ్చారు. దీంతో ఎస్పీ వీరి ప్రవర్తనపై పోలీసుశాఖ పరంగా సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ కర్నూలు- కడప రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావుకు ప్రతిపాదనలు పంపించారు. వీరిని పోలీసులు పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విజయకుమార్ గత నెలలో నిర్దేశించిన విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో అధికారిపై దుర్భాషలాడడంతో చర్యలకు సిఫారసు చేశారు.

# ఎర్రచందనం కేసులో వారెంట్

మైదుకూరు, జూలై 8: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో కడప వాసి షేక్ ఖాదర్‌బాషపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు మైదుకూరు పోలీసులు తెలిపారు. కడప నకాష్ వీధి వాసి షేక్ ఖాదర్‌బాషపై 2016లో మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. వెంటనే తిరుపతి జిల్లా కోర్టులో లేదా మైదుకూరు స్టేషన్‌లో హాజరవాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మస్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# టెట్ షెడ్యూలులో మార్పు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూలులో ప్రభుత్వం మార్పులు చేసింది. జూలై 2న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు5 నుంచి 20 వరకు టెట్ జరగాల్సి ఉండగా అక్టోబరు 3 నుంచి 20 వరకు నిర్వహిస్తామని తెలిపింది.

**కొత్త షెడ్యూలు ఇలా...**

- పరీక్ష ఫీజు చెల్లింపు ప్రారంభం కాగా ఆగస్టు 3 వరకు అవకాశం ఉంది.
- ఆగస్టు 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- సెప్టెంబరు 19 నుంచి ఆన్‌లైన్ మాక్‌టెస్ట్
- అక్టోబరు 3 నుంచి 20 వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షలు నిర్వహిస్తారు.
- అక్టోబరు 4న ప్రొవిజనల్ కీ విడుదల
- అక్టోబరు 5 నుంచి కీపై అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబరు 27న తుదికీ విడుదల
- నవంబరు 2న ఫలితాలు విడుదల

# చికిత్స పొందుతూ మహిళ మృతి

సికెదిన్నె, జూలై 8: భర్త చేతిలో గాయపడిన లక్ష్మిదేవి (48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. పాపాసాహెబ్‌పేట వాసులు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మిదేవి దంపతులు తరచూ గొడవపడేవారు. ఆదివారం అదే విధంగా గొడవ పడి కోపంతో రోకలిబడెతో భార్య తలపై కొట్టాడు. దీంతో ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు తెలిపారు. కుమారుడు హేమంత్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

# జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్) జూలై8: అన్నమయ్య జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా పరిశ్రమల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెకర్ చాంబర్‌లో జిల్లాలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమల గురించి, భూ సేకరణపై రాయచోటి, మదనపల్లి, రాజంపేట, ఆర్డీఓలు, జిల్లా పరిశ్రమల శాఖ సమీక్షించారు. పరిశ్రమల అధికారి మాట్లాడుతూ రాయచోటి మండలం శిబ్యాలలో దాదాపు 300 ఎకరాలు పారిశ్రమిక పార్క్‌కు సిద్ధం చేశామన్నారు. మదనపల్లి దగ్గర ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు నివేదికలు తయారు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు చాలా ముఖ్యమని, ఆర్థిక అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు వుండాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక పార్క్‌లకు నివేదికలు సిద్ధం చేయలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా గ్రామీణ రోడ్లు

●ఇబ్బందులు పడుతున్న ప్రజలు ●మరమ్మతులు చేయాలని వేడుకోలు

ముద్దనూరు జూలై8: గత ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వివరాల్లోకి వెళితే...గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రోడ్ల పై దృష్టి సారించలేదు.మరమ్మతులకు కూడా నిధులు కేటాయించలేదు. దీంతో గ్రామీణ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.ఎర్రగుంట్ల మండలంలో చిలమకూరు మీదుగా ఉప్పలూరు వెళ్లు దారి చాలా అధ్వానంగా ఉంది. మాదన్నగారిపల్లె నుంచి ఉప్పలూరుకు రోడ్డు కంకర తేలి గుంతలు పడ్డాయి,అదే కాకుండా నల్లబల్లె గ్రామం నుంచి రాజులగురువాయపల్లెకు వెళ్లు రోడ్డు కంకర తేలింది. నడవడానికి కష్టంగా ఉందని, ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.గతంలో ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి ఉన్న సమయంలో ఈ గ్రామాలకు తారు రోడ్డు వేశారు.వైసీపీ ప్రభుత్వంలో తారు రోడ్డు దెబ్బతిన్నా, నాటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి గెలుపొందడంతో రోడ్డు మరమ్మతు చేస్తారని ప్రజలు ఎంతో ఆశగా చూస్తున్నారు.



కంకర తేలిన నల్లబల్లె, రాజులగురువాయపల్లె రోడ్డు



మాదన్నగారిపల్లె వద్ద గుంతలు పడ్డ రోడ్డు



**తోటల వద్దకు పోవాలంటే కష్టంగా ఉంది**

గతంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేందుకు వీలుగా గ్రామీణ రోడ్లు వేశారు.నల్లబల్లె నుంచి రాజులగురువాయపల్లెకు తారు రోడ్డు వేశారు. రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు రోడ్డు బాగుండేది. జగన్ ప్రభుత్వం తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలింది. అప్పటిలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పట్టించుకోలేదు. కంకర తేలిన రోడ్డుపై వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది.

**బాబురెడ్డి, నల్లబల్లె**

## పెన్షన్‌దారులకు క్వాంటాన్ని పునరుద్ధరించాలి

బద్వేలు, జూలై 8: గతంలో ఉన్న పీఆర్‌సీలో 70 సంవత్సరాలు దాటిన వారికి 10 శాతం, 75 సంవత్సరాలు దాటిన వారికి 15 శాతంను క్వాంటం మంజూరు చేస్తూ సీనియర్ సిటిజన్‌కు ప్రత్యేక సదుపాయం ఉండేదని ఏపీ రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బద్వేలు శాఖ అధ్యక్షుడు శీలం గంగన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే అమలులో ఉన్న 10 శాతాన్ని 7 శాతానికి అలాగే 15 శాతాన్ని 12 శాతానికి తగ్గించి ఉత్తర్వులు జారీ చేసింది. దీని వలన పెన్షన్‌దారులు ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఆర్థికంగా చాలా నష్టపోయారన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తక్షణమే గతంలో ఉన్న 10,15 శాతాల క్వాంటాన్ని పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గిరిజన ప్రభుత్వ బాలుర వసతిగృహాలను ఏర్పాటు చేయాలి

కడప (మారుతీనగర్), జూలై 8: జిల్లాలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం నిమిత్తం నూతనంగా గిరిజన ప్రభుత్వ బాలుర హాస్టల్ వసతిగృహాలను మరికొన్ని ఏర్పాటు చేసి తద్వారా గిరిగిన విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచేందుకు బాటలు వేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం (ఎబీఎస్‌ఎస్) రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్, జిల్లా అధ్యక్షుడు రమావత్, జగన్నాయక్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరు శివశంకర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబరులో కలిసి విజ్ఞప్తి చేశారు. మైదాన ప్రాంతంలో నివశిస్తున్న గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న జూనియర్, డిగ్రీ, పీజీ, కాలేజీల ఉపాధ్యాయ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అర్జున్‌నాయక్, వెంకటస్వామి నాయక్, బీడీ నాయక్, శ్రీనునాయక్, గోపినాయక్, రమేశ్‌నాయక్, మల్లే నాయక్, బాబునాయక్‌పాల్గొన్నారు.

## రేపు జాబ్‌మేళా

జమ్మలమడుగు/ఎర్రగుంట్ల, జూలై 8 : జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాసినవారు, ఐటీఐ పూర్తిగా పాస్ అయినవారు వినియోగించుకోవాలని ఆయన కోరారు. జాబ్‌మేళాలో అమర్‌రాజా కంపెనీ (తిరుపతి), గ్రీన్‌టెక్ ఇండ్రస్ట్రీస్ (ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నాయుడుపేట, కడప) న్యూహేలోన్ ట్రాక్స్ (ప్రొద్దుటూరు), ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ కొప్పర్తివారు జాబ్‌మేళాలో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాబ్‌మేళాకు బయోడేటా ఫారంతో ఉదయం 10 గంటల నుంచి హాజరుకావాలన్నారు.

## బీజేపీ నాయకుడికి పరామర్శ

ఎర్రగుంట్ల, జూలై 8: ఎర్రగుంట్ల నడిపూరుకు చెందిన బీజేపీ నాయకుడు జిల్లెల్ల రఘురామిరెడ్డిని కూటమి మండల ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి ఇతర నాయకులు సోమవారం పరామర్శించారు. ఇటీవల రఘురామిరెడ్డికి కాలు ఫ్యాక్చర్ అయ్యింది. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. నాయకులు రాజగోపాల్‌రెడ్డి, కత్తిప్రతాప్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు సూర్యనారాయణ రెడ్డి, బాల నారాయణరెడ్డి,జిల్లెల్లఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

## వారాహి నవరాత్రి పూజా మహోత్సవాలు విజయవంతం చేయండి

జమ్మలమడుగు, జూలై 8: జమ్మలమడుగులోని గ్రంథే సోమేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వారాహి నవరాత్రి పూజా మహోత్సవాలు జరుగుతున్నట్లు దేవస్థాన అధ్యక్షుడు నాగభూషణం, కమిటీవారు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు లలిత సహస్ర నామాలు తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 7.30 గంటలకు తీర్థప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే పూజా అర్చనాదులలో భక్తులు విరివిగా పాల్గొనాలని వారు కోరారు.

## స్థానిక సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ను కలసిన జనసేన నాయకులు

మైదుకూరు, జూలై 8 : మైదుకూరు ప్రాంత సమస్యలపై స్థానిక జనసేన నాయకులు కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిసి విన్నవించారు. జనసేన నాయకులు చిలుంగారి క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు సోమవారం కలెక్టర్‌ను కలసి, పశువుల సంతను మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలోకి మార్చాలని కోరారు. అలాగే బైపాస్ నిర్మాణంలో పుష్పగిరి దేవస్థానం భూములు కొనుగోలు చేసిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించి, ఈ మేరకు వినతి పత్రం అందచేశారు.

## మొక్కలునాటండి పర్యావరణ పరిరక్షించడి

పోరుమామిళ్ల, జూలై 8 : మొక్కలునాటండి, పర్యావరణ పరిరక్షణ చేయండి ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డి అన్నారు. సోమవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా టేకూరుపేట బీట్ పరిధిలో కవలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలతో కలిసి మొక్కల ఆవశ్యకత, పర్యావరణం గురించి ర్యాలీ నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీట్ అధికారి కరుణాకర్, డాగ్ స్క్వాడ్ గురయ్య, ప్రధానోపాధ్యాయులు రామలక్షుమ్మ, టీడీపీ నాయకులు రామరాజు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రంగస్థల పద్యపోటీలు



గెలుపొందినవారికి నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం


ప్రొద్దుటూరు టౌన్, జూలై 8: శివాలయంలో శ్రీ వెంకటసాయి తెలుగు కళాకారుల సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రంగస్థల పద్యపోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించాలన్న ఆశయంతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. శ్రీ చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బంగారు రఘురామయ్య, తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణలు మాట్లాడుతూ నాటకాలు, కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 57 మంది పద్యకళాకారులు హాజరై తమ పద్యాలను పాడి ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో గెలుపొందినవారు కేవీరావు (కడప) ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి ఓబులేసు (మైదుకూరు ) రూ.2 వేలు, తృతీయ బహుమతి గంగయ్య (ప్రొద్దుటూరు)కు వెయ్యి రూపాయలు అందజేశారు. 17 మంది కళాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నారాయణ, హార్మోనిస్టు క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం పుణ్యకార్యం



ప్రొద్దుటూరు టౌన్, జూలై 8: అన్నదానం పుణ్యకార్యమని శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శివోహం ఆధ్వర్యంలో శివాలయంలో ప్రతిసోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా మురికూటి సూర్యనారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా శివాలయంలో ప్రతి సోమవారం తమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, విష్ణునారాయణ, విజయ్‌కుమార్, లింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### కడప ఇన్‌చార్జ్ ఆర్డీఓగా వెంకటపతి బాధ్యతల స్వీకరణ



కడప(కలెక్టరేట్), జూలై 8: కడప రెవె న్యూ డివిజనల్ ఇన్ చార్జ్‌గా వి.వెంటపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా కడప ఆర్డీఓ మధుసూదన్ సెలవుపై వెళ్లడంతో వెంకటపతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అలంకారప్రాయంగా సంపద కేంద్రాలు

●లక్షలు వెచ్చించినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం ● జీతాలకోసం నెలల తరబడి ఎదురుచూపులు● ఇప్పటికే సగంమంది విధులకు దూరం

కాశినాయన,జూలై 8: స్వచ్ఛసంకల్పంతో ప్రతి గడపనుంచి చెత్త సేకరించాలి, ప్రజలు నివాసముంటున్న వీధులు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నాయి. ఈవిషయం క్షేత్రస్థాయిలో చాలాచోట్ల ఆచరణకు నోచుకోవడంలేదు. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న హరితరాయబారులు,కాపలాదారులు వేతనాలకోసం నెలలతరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే కొంతమంది పనిచేయలేమని మానేస్తుండటంతో గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలు తలెత్తుతున్నాయి.వర్షాకాలం ప్రారంభమైనందున మున్ముందు గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. మొత్తం మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో 15(ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్తనుంచి సంపద సృష్టించే కేంద్రాలు ఉన్నాయి.వీటి నిర్మాణం కోసం గత 6సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పథకంలో దాదాపు కోటి రూపాయలు ఖర్చుచేశారు. ప్రతి కేంద్రానికి కరెంట్, రహదారి,నీటిసౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారుల ఆదేశించినా క్షేత్రస్థాయిలో చాలావరకు వాటి ఊసేకనిపించని పరిస్థితి. ఈకేంద్రాల్లో దాదాపు 50 మంది హరితరాయబారులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతి నెలా రూ.6000 వేలు వేతనం ఇవ్వాల్సిఉంది. వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో చాలామంది పనులు మానేస్తున్నారు. చెత్తసేకరణకు ఇచ్చిన మూడు చక్రాల సైకిళ్ళుకూడా నిర్వహణాలోపంతో తుప్పుపట్టిపోతున్నాయి. గతంలో ప్రభుత్వాలే వీరికి జీతాలు ఇచ్చేవి. గత సంవత్సరం నుంచి గ్రామపంచాయతీలే తమకున్న నిధులనుంచే జీతాలు చెల్లించాలని ప్రభుత్వాలు ఆదేశించాయి. దీంతో ఆదాయమార్గాలు,ఆర్థిక వనరులు తక్కువగాఉన్న పంచాయతీల్లో జీతాలు చెల్లించలేనిపరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సర్పంచులు గతంలో లాగా స్వచ్ఛభారత్ సంస్థనుంచి సిబ్బంది జీతాలు చెల్లించాలని ప్రభుత్వాలను కోరారు. మండల కేంద్రమైన నర్సాపురంలో కొద్దోగొప్పో జీతాలు ఇచ్చి చెత్తసేకరిస్తున్నారుగాని మిగిలిన పంచాయతీల్లో చెత్తసేకరణ పంచాయతీలకు తలకుమించిన భారంగా మారిందంటున్నారు. రంపాడు,చెన్నవరం తదితర గ్రామపంచాయతీల్లో కేంద్రాలు నివాసప్రాంతాలకు దూరంగా ఉండటంతో తడి,పొడి చెత్తను సేకరించి తొట్లల్లో పోయడం సాధ్యం కావడంలేదు. నర్సాపురం ఎస్‌డబ్ల్యూసీ కేంద్రానికి సరైన దారి సౌకర్యం కూడాలేదు. వర్షంవస్తే సైకిళ్లు వెళ్ళలేవు. దీంతో ఈకేంద్రాలు అన్నీ అలంకారప్రాయంగా మారాయి. నిధులు లేకపోవడంతో సర్పంచులు,అధికారులు పెద్దగా దృష్టి పెట్టడంలేదు.ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెత్తసేకరణ చేయకపోతే గ్రామాలు అపరిశుభ్రంగా మారి దోమలు ప్రబలే అవకాశం ఉందని గ్రామీణులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యంచేసుకొని గ్రామాల్లో చెత్తసేకరణ పనులను చేపట్టి పల్లెలు పరిశుభ్రంగా ఉండేలాచూడాలని పలువురు కోరుతున్నారు.ఈవిషయంపై ఈవోపీఆర్డీ రామక్రిష్ణారెడ్డిని వివరణకోరగా నిధుల కొరత మాటవాస్తవమేనని రెండు నెలల నుంచి మండల కేంద్రమైన నర్సాపురంలో చెత్తసేకరణ ప్రారంభించామని మిగిలిన పంచాయతీల్లో కూడా సర్పంచులతో మాట్లాడి నిధుల వెసులబాటును చూసుకొని చెత్తసేకరణ పనులు మొదలుపెడతామన్నారు.



అలంకార ప్రాయంగా ఉన్న నర్సాపురం సంపద కేంద్రం

### పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి

పోరుమామిళ్ల, జూలై 8 : అంగన్వాడీ కేంద్రాలు లేని గ్రామాల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని ఎస్టీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి జయరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పోరుమామిళ్ల లోని ఎస్టీయూ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని నరసింగపల్లె తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు లేని కారణంగా చిన్నపిల్లలు దూరంగా ఉండే ప్రైవేటు పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలలో చేరి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈకారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు సంవత్సరాలు నిండిన బడి ఈడు పిల్లల చేరికలు తగ్గిపోయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు వెలవెలబోతున్నాయన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు

గోపవరం, జూలై 8 : సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని తహసీల్దారు రోశయ్య అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిస్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సోమవారం ఆయా శాఖల అధికారులతో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన వినతిపత్రం స్వీకరించామన్నారు. ఎంపీడీవో రాధాక్రిష్ణ, ఈవోపీఆర్‌డీ షేక్‌హసీనా,ఎంఎస్‌వో నాగరాజు, ఐసీడీఎస్ లక్ష్మీదేవి, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### డాక్యుమెంట్ పోయినది

YSR కడపజిల్లా, పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతి, కొత్తపేట గ్రామంలోని రామిరెడ్డి మల్లారెడ్డి S/o నరసింహారెడ్డి గారి ఒరిజినల్ రిజిష్టర్డ్ డాక్యుమెంట్ నెం. 3357/1976 ఆటోలో ప్రొద్దుటూరుకు వెళుతుండగా పోయినది. దొరికిన వారు క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు

సెల్:94805 21259,రామిరెడ్డి శివశంకర్‌రెడ్డి

## బీసీ బాలికల వసతి గృహాన్ని పునఃప్రారంభించాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన హాస్టల్ విద్యార్థినులు



తహసీల్దారు విద్యాసాగర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 8: బీసీ బాలికల వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని హాస్టల్ విద్యార్థినులు సోమవారం తహసీల్దారు విద్యాసాగర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొల్లవరంలో ఉన్న వసతి గృహం గత విద్యా సంవత్సరం చివరిలో ఉన్నట్లుండి కూలిపోవడంతో తమను కళాశాల బాలికల వసతి గృహంలోకి మార్పు చేశారన్నారు. అక్కడ ఉన్న వసతి గృహం శిథిలావస్థకు చేరిందని, సరైన వసతులు లేవని పేర్కొన్నారు. దీనితో తాము సుదూరంగా ఉన్న తమ ఇళ్ల వద్ద నుంచే రోజు పాఠశాలకు చేరుకోవడం కష్టంగా మారిందన్నారు. తమ సమస్యపై బీసీ సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తెచ్చినా కాలయాపన చేస్తున్నారే తప్ప తగిన చర్యలు తీసుకోవడంలేదన్నారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని నైట్ సెల్టర్‌లో వసతి గృహం ఏర్పాటు చేయాడానికి ఎమ్మెల్యే అంగీకరించారు. అందువలన త్వరగా వసతి గృహం ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, తల్లిదండ్రులు, గంజికుంట నాగరాజు పాల్గొన్నారు.



## సామాన్య ప్రజలకు అందుబాటులో ఇసుక

పోరుమామిళ్ల, జూలై 8 : ప్రజలకు ఉచితంగా ఇచ్చే ఇసుకను క్షుణ్ణంగా పరిశీలించి ఇవ్వాలని ఆర్డీవో చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుక క్వారీలో ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్న కార్యక్రమానికి హాజరై తహసీల్దారు శిరీషా,ఎంపీడీవో వర ప్రసాద్‌రావు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తూకాలు వేసేటప్పుడు ఇసుకను సమపాళ్లలో ప్రజలకందించాలన్నారు. దాదాపు 1520 టన్నుల ఇసుకను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిమోతి, ఏఎస్‌ఐ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

**సామన్య ప్రజలకు అందుబాటులో ఇసుక**

కొండాపురం, జూలై 8: గత వైసీపీ ప్రభుత్వం మాదిరి ఇసుక దోపిడీ లేకుండా కూటమి ప్రభుత్వం సామన్య ప్రజలకు అందుబాటులోకి ఇసుకను తెచ్చిందని ఎమ్మెల్యే సోదరుడు శివనారాయణరెడ్డి తెలిపారు.మండలంలోని పి.అనంతపురం,కె.వెంకటాపురం గ్రామాల వద్ద అయిన సోమవారం ఇసుక స్టాక్‌పాయింట్‌ను ప్రారంభించారు. ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం సీనరేజీ చార్జీలు,లోడింగ్ చార్జీలతో ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఎంపీడీవో నాగ ప్రసాద్ మాట్లాడుతూ టన్నుకు రూ.340(అన్ని చార్జీలు కలిపి) చొప్పున స్టాక్‌పాయింట్ వద్దే ఆన్‌లైన్ పేమెంట్ చెల్లించి ఇసుకను పొందవచ్చునన్నారు. రోజుకు ఒక వ్యక్తికి 20 టన్నులు మాత్రమే ఇసుకను పొందవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో రెవెన్యూ అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో చంద్రమోహన్




కొండాపురం మండలంలోని పి.అనంతపురం వద్ద ఇసుక స్టాక్‌పాయింట్‌ను ప్రారంభిస్తున్న శివనారాయణరెడ్డి